# నేరస్థుడు

**సుమన్**

ప్రత్యక్ష ప్రమాణానికి మించిన ప్రమాణం లేదంటారు. ఇది ఎంతటి అనర్థదాయకమైన అభిప్రాయమో నిరూపించగలిగేది అనుభవం. కాని దానివల్ల ప్రయోజనం స్వల్పం. జరగకూడనిది జరిగి, అమాయకులైన వారు శిక్ష అనుభవించిన తరవాత మిగిలేది తీరని మనోవ్యథ మాత్రమే.

సాయంకాలపు నీరెండ నిండుముసుగు వేసుకొని నైరాశ్య పాత్రాన్ని కంఠస్థం చేస్తూంది. పలయ జీవితపు పరిధిమీద తిరుగాడుతున్న చరాచరాలు మొదటి మజిలీ పూర్తి చేస్తున్నాయి. వృద్ధాప్యభారంతో కర్రపందిరికి పెనవేసుకొన్న పాలితీగ ఆశల చిగురులను చిగురించలేక, కుసుమాల అందాన్ని అందించలేక జీవితపు చివరి మలుపును గూర్చి తల వంచుకుని తీక్ష్ణంగా ఆలోచిస్తూంది. రోడ్డుమీద పోతున్న బిచ్చగాడు 'జీవిత మింతేలే' అని వ్యథాపూరిత కంఠస్వరాన్ని పదవేగంతో మిళితంచేసి నిశీథయాత్ర నిర్విరామంగా చేయాలని పోతున్నాడు.

ఇవన్నీ రామనాథంగారు రోజూ వినేవే, చూచేవే. పిట్టగోడ పక్కన కూర్చుని ముఖాన్ని మోకాళ్లమీద పెట్టి ఆలోచించడం ఆయనకు రిటైరు అయిన తరవాత కలిగిన అలవాటు. సాయంకాలపు నీరెండ సగం ముఖాన్ని తన రంగు పులమటానికి ప్రయత్నిస్తూ ఉంటే పిట్టగోడ అనుచరుడుగా ఏర్పరుచుకున్న నీడ మిగిలిన సగం ముఖాన్ని కప్పివేయడానికి ప్రయత్నిస్తూంది. ఆయన ఆ గోడకు తలను ఆనించి నెమ్మదిగా తెల్లని జుట్టులోనికి వేళ్లను పోనిచ్చి సవరించుకొంటూ ఆలోచించుకొంటూ ఉంటాడు.

ఆయన రిటైరు అయి ఆరేళ్లయింది. ప్రైవేటు కంపెనీవారు తన మీద ఉన్న అభిమానంతో ఇచ్చే పెన్షను ఆరేళ్లనుంచి వస్తూనే ఉంది. తను ఉద్యోగం చేసినన్నాళ్లు తన జీతంమీద, తన కర్తవ్య సాధన మీద సంపాదించినది ఓ చిన్న రెండంతస్తుల మేడ, ఆ ఊళ్లో మంచి పేరూను. ఇద్దరు కొడుకులు ఆయనకు రెండుచేతులువంటి వాళ్లు. పెద్దకొడుకు రాము ఎమ్. బి. బి. ఎస్. పూర్తిచేసి ఆ తరవాత పెళ్లి కూడా చేసుకొని ఊళ్లోనే ప్రాక్టీసు పెట్టాడు. రెండో కొడుకు కృష్ణ బి. ఇ. ఫైనల్ఇయర్ చదువుతున్నాడు. ఒక్క కూతురు సావిత్రి కాపరానికి వెళ్లి చాలా ఏళ్లయి నట్టుంది రామనాథంగారికి. ఆయన ఆశించినట్లుగా సావిత్రి కడుపున పంట పండలేదు. కాని, పెళ్లి అయిన పదేళ్లకు సావిత్రి గర్భవతి అని తెలియగానే ఆయన సంతోషానికి హద్దులు లేవు. మూడు నెలల ముందుగానే తీసుకువచ్చి తన దగ్గిర అట్టేపెట్టుకున్నాడు. ఇన్నిటిని గురించి ఆలోచించుకొంటూ, కృష్ణ వ్రాసిన ఉత్తరాలు చదువుకొంటూ, సావిత్రితో కబుర్లు చెప్పుకొంటూ ఆయన కాలాన్ని దొర్లించి వేస్తున్నాడు. అందరి ఎదటా ఆనందంగా గడిపినా ఆయన హృదయంలో విషాదం మగ్గుతూందని ఆ ఇంట్లో అందరికి తెలుసు. అందుకు కారణం, రామనాథంగారి అర్ధాంగి కామేశ్వరమ్మ. ఆవిడ పోయికూడా పాతికేళ్లయింది. ఆవిడ ఎలా చచ్చిపోయిందో ఎవ్వరికి తెలియదు. గుండెనెప్పి అన్నారు చాలామంది. కాని, ఆవిడ ఎలా చచ్చిపోయిందో, ఎందుకు చచ్చిపోయిందో తెలిసినవాడు ఒక్కడే రామనాథంగారు. ఆ ఒక్క వ్యక్తి నిండా విషాదం నిషాలాగ ఆవరించింది.

రిటైరు అయిన తరవాత అయనలోని విషాదపు కదలికలు ఎక్కువయ్యాయి. వయస్సు తెచ్చిన బలహీనత, అనుభవం తెచ్చిన ఆవేశం ఆయన్ను అధీరుణ్ణి చేస్తున్నాయి. సాయంత్రపు వేళ పిట్టగోడ నానుకొని తను వ్రాసిన డైరీలోని పేజీలు ఒక్కొక్కటి చదవటం అలవాటుగా ఏర్పరుచుకొన్నాడు. ఆరు సంవత్సరాలనుండి చదువుతున్న డైరీలు జీవితంలోని అనుభవాలులాగానే వెనకపడిపోయాయి. ఇవాళ ఆయన చదువుతున్న పేజీలు ఆయనను కదిలించి వేస్తున్నాయి. ఆ పేజీంలోని సారం ఆయన జీవితానికి శ్రీవ్రాఘాతం, కామేశ్వరమ్మ బాధకు కారణం.

పీటని చదివి కళ్లనీళ్లు నింపుకొని అస్తమిస్తూ అరుణరాగాన్ని విరజిమ్మటానికి యత్నిస్తున్న వృద్ధ సూర్యుణ్ణి చూస్తూ ఆయన జీవితంలోని సంఘటన మీద మసక తెరను తొలగించటానికి విపరీత యత్నం చేస్తున్నాడు.

ఆ రోజు ఆయనకు బాగా గుర్తు. అది ఆయనకు, కామేశ్వరమ్మగారికి మధ్య సమాంతరరేఖ గీసి మళ్లీ అదే ఆమె మృత్యువుకు, తన విషాదానికి శూలంలాగ మారింది. కామేశ్వరమ్మను పుట్టింటికి పంపించి చేతులు కాల్చుకోక తప్పింది కాదు రామనాథంగారికి. ఒక్కొక్కరోజు ఆఫీసు ప్యూను వచ్చి ఉడకవేసిపోతూండేవాడు. ఒక్కొక్కసారి వాడు రాకపోతే ఆయనే చెయ్యి కాల్చుకుంటూ ఉండేవాడు. త్వరలో చిన్నారి కూతురు కౌగిలి బిగిలోకి వస్తుందని ఆయనకు చాలా సంతోషంగా ఉండేది. తనకు పండంటి కూతురు కలిగిందని కామేశ్వరి తనకు ఉత్తరం వ్రాసిన రోజున ఆయన సంతోషానికి హద్దులు లేవు. మొదటి కాన్పుకు రామం, రెండో కాన్పుకు కృష్ణ, మూడో కాన్పుకు సావిత్రి. సావిత్రిని ఎత్తుకొని త్వరలోనే వచ్చేస్తానని కామేశ్వరి వ్రాసిన ఉత్తరం రామనాథంగారు చాలాసార్లు చదువుకొన్నాడు.

ఆపైన చాలా రోజులు గడిచిపోయిన తరవాత ఓ రాత్రి—రామనాథంగారి జీవితంలో మలుపు తిప్పిన రాత్రి. అప్పుడు చలిగా ఉంది. చలిగాలులు వీస్తున్నాయి. కలికాలపు అరుపులవలె కారుమేఘాలు గర్జిస్తున్నాయి. పేదవాడి ఆశలా, బికారి నవ్వులా మెరుపులు మెరవటానికి ప్రయత్నించి మాయమవుతున్నాయి. రివ్వున వీచే గాలి, గలగలమని రాలిన ఎండుటాకుల సవ్వడి, మేఘాల అరుపులు, మెరుపులు. చీకటి చిక్కగా కన్నెకాటుకలా ఉంది. అన్ని తలుపులు బిగించి కామేశ్వరి ఉంటే తనకు ఈ చలిరాత్రి ఉండేది కాదనుకున్నాడు రామనాథం. ప్యూన్ వండిన అన్నం ఛట్నీతో తిని వచ్చి పడుకొంటే ఆయనకు ఆ చీకటి చలిరాత్రులలో కూడా వెన్నెల, కామేశ్వరి కౌగిలిలోని గోరువెచ్చదనం గుర్తుకు వస్తున్నాయి. బయట రివ్వుమని గాలి వీస్తూ ఉన్నా ఆయన చెవులకు కామేశ్వరి గుసగుసలు వినపడుతున్నాయి. కామేశ్వరి తనకు దొరకటం తన అదృష్టం అనుకున్నాడు రామనాథం. ఆమె లేకపోతే తన జీవితానికి వెలుగులేదేమో. చిరుతీపిలాంటి కన్నెవలపునుంచి తల్లిగా కామేశ్వరి వరకు రామనాథంగారికి బాగా తెలుసు. తొలిరోజుల చిరునవ్వులలో ఎంత ప్రేమించేదో, ఇద్దరుముగ్గురు బిడ్డల తల్లి అయి కూడా సంసార బాధ్యతలన్నీ నెత్తిన వేసుకొని అంతగా ప్రేమించేది. అందుకే కామేశ్వరి అంటే తనకు ఇష్టం, ప్రేమ, ప్రాణమూను.

కామేశ్వరిని గూర్చి ఆలోచిస్తున్న రామనాథంగారికి తలుపు చప్పుడు అవుతున్న శబ్దం వినిపించింది. వెళ్లి తలుపు తీశాడు. బయట కుండపోతగా వర్షం కురుస్తూంది. బయట చీకటికి, లోపలి వెలుగుకు అంచుల మధ్య ఓ స్త్రీ నించుని ఉంది. ఆమెమీద రామనాథంగారి నీడ నిండుగా పడింది. పక్కకు తప్పుకొని వెలుతురులో ఆమె స్త్రీ అని గుర్తించాడు రామనాథం. చీర తడిసిపోయింది. తలనుంచి నీళ్లు జలజలా రాలుతున్నాయి. శరీరం చలికి వణుకుతూంది. కళ్లు ఏదో తీవ్రవ్యథతో యాచనాదృక్కులను నింపుకొంటున్నాయి. వాటిని చూచి అధీరుడయ్యాడు రామనాథం. ఆమె ఎవరో, ఎందుకు వచ్చిందో తెలుసుకోవాలని అనిపించలేదు. ఆమెకు ఆ రాత్రి సాయం చెయ్యాలి. అంతే. లోనికి తీసుకెళ్లి కామేశ్వరమ్మ చీర ఒకటి ఇచ్చాడు. ఆమె చీర ధరించింది. తల తుడుచుకొంది. శరీరంలోని బలహీనత, ఏదో విషాదపు నీడ ఆమె ముఖంలో కనిపించాయి రామనాథానికి. ఆమె కన్నులు రామనాథంగారి కేసి చూస్తూ అభ్యర్థన వెలువరిస్తున్నాయి. ఆషాఢమేఘాలలా ఉన్న ఆ కన్నులు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి. హృదయంలోని ఆవేదన, ఆంతర్యంలోని ఆవేశము, గుండెలలో పిండిచేసే బండరాళ్ల మోత ఆమె ముఖంలోను, ఆమె కన్నులలోను అగుపడుతున్నాయి.

ఆ నిశిలో నిస్సహాయంగా వచ్చిన ఆమె ఎవరో తెలుసుకోవా లనిపించలేదు రామనాథానికి. కొన్ని రోజులనుంచి స్త్రీ జాడ లేని ఆ ఇంటిలో మరో పరాయి స్త్రీ నీడ మెదులుతూందని తెలియగానే ఆ సంఘం—ఆ మనుష్యులు, ఈ మనసులు, ఈ ఆంత

ర్యాలు ఏమని ఘోషిస్తాయో అని రామనాథం ఒక్క నిమిషమైనా ఊహించలేదు.

ఊహించవలిసిన అవసరం తన ఆత్మకు లేదు. పరమాత్మకు ఉందేమో నని అణుమాత్రమయినా హృదయసాగరంలోని లహరిక కదలాడలేదు.

చలిలో తడిసిన తరవాత పొడి దుస్తులు ధరించిన శరీరంలానే ఉంది ఆయన హృదయం. ఏదో త్యాగం ఏదో పవిత్రత అనే ఈ రెండూ ఆయనను ఆ స్త్రీకి సహాయం చేయటానికి ప్రోత్సహించాయి. ఆమెను మంచంమీద పడుకోబెట్టి ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసి ఆమె పెదవుల ముందు ఉంచాడు. ఆ పెదవులు వణుకుతూ కదిలాయి. ఆమె తలమీద చెయ్యి వేసి కొంచెం కొంచెంగా కాఫీ పోశాడు. అప్పటికి ఆమె హృదయంలోని, దడ, ఆవేదన ఒక్కసారి తగ్గినట్లయింది. వేడికాఫీతో చలిచలిగా ఉన్న ఆకలి కూడా వెనుదిరిగింది. ఆమె ముఖంలో ప్రశాంతత అలుముకొంది.

మొదటిసారిగా ఆమె ముఖంలోకి పరిశీలనగా చూచాడు రామనాథం. కొంచెం పాలిపోయి ఉన్న చెక్కిళ్ళు, సున్నితమైన నుదురు, లేత గులాబిరంగు కొత్తగా పులుముకుంటున్నట్లుగా ఉన్న పెదవులు, మెడలో సన్నని గొలుసు, అలల కదలికలోనుంచి అపుడే ఉద్భవించిన కలవరేకులను విదిలించుతున్నట్లు ఉన్న కన్నులు, నుదురుమీద చిలిపి చిలిపిగా అలుముకొన్న వెంట్రుకలు— అందంగానే ఉంది.

ఆమెకన్నులు మూసుకొని సుషుప్తికోసం ప్రయత్నం చేస్తూంది. రామనాథం లేచి వెళ్ళి కిటికీ తలుపులు తెరిచి చూచాడు. వర్షం ఇంకా కురుస్తూనే ఉంది. మేఘాలు అరవలేక కూనిరాగాలు తీస్తున్నాయి. మెరుపులు మెరవలేక కునుకు తీస్తున్నాయి. వర్షపు చినుకులు మాత్రం ఎక్కువగా విరగబడి నవ్వుతున్నాయి.

కిటికీ తలుపులు మూసి ఆలోచనలో పడ్డాడు.

ఈ నిశీథిలో విధిని తిట్టుకొంటూ కదిలి వచ్చిం దా యువతి. వర్షపు రాత్రి యౌవనోత్కర్షను నింపుకొని ఎదురుగా ఉంది స్త్రీ. బయట చలిగాలుల స్వరాలకు నరాల ఆకలి పిలుపులు వినపడుతున్నాయి. గగనంలోని కారుమేఘాల ఒరవడిలానే రామనాథం హృదయంలో భావం మరొక భావాన్ని ఢీకొంటున్నది.

మసక మసకగా ఉన్న వెలుతురు కునికిపాట్లలో స్త్రీత్వపు చాయలు, చలిచలిగా ఉన్న నిశీథి నింగిలో చిరువెచ్చదనపు లయలు.

కలల కోసం ఎదురుచూస్తున్న అలల నాదంలో భావాల హొయలు, కాలపు పరుగులో అందుకోలేక ఆత్మ పడే ఆవేదన నివాళులు.

దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ కిటికీ దగ్గరగా వచ్చాడు రామనాథం. ఈసారి కిటికీ తీసి మళ్ళీ బయటికి చూడాలనిపించలేదు. పడక గదివైపు మాత్రం చూచాడు. ఆమె ప్రశాంతంగా నిద్రపోతూంది. జీరో కాండిల్ బల్బు కూడా ఆమె ముఖాన్ని దేదీప్యమానంచేస్తూ నవ్వుతూంది. దుప్పటి కప్పుకొని వెల్లకిలా పడుకొని ఉంది. దుప్పటికి అతుక్కుపోయిన శరీరం యౌవనపు చిహ్నాలను స్పష్టంగా ధ్రువపరుస్తూంది. ఆమె ఊపిరి కనుగుణంగా ఉన్న రొమ్ముల కదలిక కాలానికి పట్టనట్లుగా ఉంది.

మళ్ళీ ఒక్కసారి నిట్టూర్చాడు రామనాథం.



అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక







# నేరస్థుడు

తన గదిలో తనతోపాటు మరొక స్త్రీ రాత్రి అంతా గడిపిందని ఈ సంఘానికి సూర్యకిరణాల వెదజల్లుతోపాటే తెలిసి రభుల్లుమ--ుంది. సంఘం అంతా ఏమి ఊహిస్తుందో తనకు తెలుసు. తాను చేయని నేరానికి, అపవిత్రతకు, అనర్థానికి ఈ లోకం ముందు తలవంచాలి. అందరి అనర్థపూరిత హృదయాల ముందు తను అపార్థంగా నిలబడాలి. అటువంటప్పుడు అందరూ తనను నేరస్థుడుగా భావించినప్పుడు ఆ నేరం తను చేస్తే ఏమిటి? అందాన్ని కందర్ప దైవతం ముందు పరిచినట్లుగా ఉంది తన ముందు ఆమె. ఆమె యౌవనపు బిగి, స్త్రీత్వపు జిగి తన వాంఛల భాగీరథిలో మునిగిపోతే తనకేం?

మనుగడకు మూలమైన పవిత్రత ఏ మూలకు పోయి ఏడుస్తుంది? సుఖం, త్యాగం, ఆశ, వెలుగు లేని ఈ పవిత్రత ఎవడికి కావాలి? అపవిత్రత అయినా కావలిసింది సుఖం. దానికోసం ఆ కొంచెం మనుగడ పోతే ఎవడికి కావాలి?

ఈ విధంగా ఉన్న ఆలోచనలతో రామనాథం హృదయం ఝల్లుమంది. తను నాశనానికి మొదటి మెట్టు ఎక్కుతూ తడబడుతున్నాడు. తన జీవితపు గ్రంథంలో ఉన్న అక్షరాలపై నల్లని సిరా దిమ్మరించి నలిపి వేస్తున్నాడు. కాలం పోతూ ఉంటే తను తన జీవితపు ద్వారంవద్ద ఎటు పోవాలో తెలియక తికమక పడుతున్నాడు.

ఆయన హృదయంలో ఆత్మకు, పరమాత్మకు యుద్ధం సాగుతూంది. కాలం, ఆత్మ ఢీకొంటున్నాయి. అనుభవం, ఆత్మ కుస్తీ పడుతున్నాయి. ఆవేశం, ఆత్మ అరుస్తున్నాయి. ఆశ, ఆత్మ చిన్నగా గొణుక్కుంటున్నాయి. అనుభూతి, ఆత్మ తల వంచుకొని ఆలోచిస్తున్నాయి.

కొంచెంసేపు జరిగిన ఈ సంఘర్షణలో ఆత్మకు విజయం లభించింది. ఏదో తియ్యని భావంతో, ఏదో తెలుసుకోని ఆనందంతో, ఏదో త్యాగంలోని ఆవేశంతో రామనాథం హృదయం నిండిపోయింది. నెమ్మదిగా వెళ్లి ఆమె మంచంమీద ఒక పక్కన కూర్చుని దుప్పటి ఆమె మెడవరకు లాగి ఆమె తల నిమరసాగాడు. ఆమె పెదవులు నిద్రలో లాస్యం చేస్తున్నాయి. ఆ పెదవులవంక అలాగే చూస్తూ ఆ తలను నిమురుతూ ఉండిపోయాడు చాలాసేపు. ఉన్నంతసేపు ఆయన హృదయంలోని వేయిదీపాల కాంతి, వేయివెలుగుల శాంతి కరిగి క్రాంతిని చల్లార్చాయి. మనుగడకు మూలమైన చల్లని లహరిక, పవిత్రతకు స్థానమైన నీహారిక, త్యాగానికి ఆధారమైన కాంతికళిక ఆయవ హృదయంలో వెలిగాయి. వాటితో ఎంతసేపు ఉన్నాడో తెలియదు.

కెవ్వున పసిపాప కేక వినిపించేసరికి ఉలిక్కిపడ్డాడు రామనాథం. తన గదిలోనే కామేశ్వరి! చెప్పకుండానే అమాంతంగా దిగిన కామేశ్వరిని చూచి ఆశ్చర్య పడలేదు కాని ఆమె హృదయంలో మొట్టమొదటి

సారిగా అగుపడిన అస్పష్టభావపు నీడ చూచి అదిరిపడ్డాడు. ఆ స్త్రీ పక్కనే మంచం మీద కూర్చున్న తన భర్తను చూచి స్త్రీలాగానే భావించింది కామేశ్వరి. ఆ భావనకు భయపడ్డాడు రామనాథం.

ఏదో చెప్పాలనుకున్నాడు కాని, అంతలోనే కామేశ్వరి తల వంచుకొని పక్కగదిలోకి వెళ్లిపోయింది. బయట వరండాలో రిక్షావాడికి డబ్బులిచ్చి సామాను లోపల పెట్టించి తడిసిన బట్టలు పిండుకొంటున్నారు మామగారు.

ఈ అర్ధరాత్రివేళ తను ఆవిధంగా పరీక్షించబడడానికే వాళ్ళు వచ్చారేమో!

బట్టలు పిండుకొని లోపలకు వచ్చి ఆ పక్క మీద మరో స్త్రీ పడి ఉండడం చూచి కొంచెం ఆశ్చర్యపడి మళ్లీ వరండాలోకి వెళ్లారు మామగారు.

పక్క గదిలోనుంచి కామేశ్వరి వెక్కివెక్కి ఏడుపు వినిపిస్తూంది.

'ఏమిటి, భగవాన్, తనకీ పరీక్ష?' అనుకొన్నాడు రామనాథం.

పక్క గదిలోకి వెళ్లాడు రామనాథం. కామేశ్వరి పసిపిల్లని ఒడిలో పడుకోబెట్టి ఏడుస్తూంది.

'స్త్రీ హృదయం ఇంత బలహీనమా!' అనుకొన్నాడు.

తనలాంటి స్త్రీకి తన మగవాడు ఆశ్రయం ఇస్తే సంశయిస్తుంది స్త్రీ. మగవాడు మగవాడుగా అయిపోయిన తరవాత స్త్రీ, అగాధంలా బాధను దిగమింగగలననుకొనే స్త్రీ, ఒంటరిగానే కనిపించింది రామనాథానికి. కామేశ్వరి గదిలో ఒంటరిగానే కూర్చుని ఏడుస్తూంది ఒంటరి భావంతో.

ఆ భావాన్ని చూచి భయపడిన రామనాథం తరవాత కతినుడయ్యాడు.

"కామేశ్వరీ! ఏమిటి ఈ అర్థంలేని వ్యవహారం? కలుషిత భావం కలలో కూడా రానియ్యకు."

కామేశ్వరి ఏడుస్తూనే అన్నది: "ధర్మం తప్పి ధైర్యం నూరిపొయ్యడానికి ప్రయత్నించకండి."

చిన్నగా నవ్వుకొన్నాడు రామనాథం కామేశ్వరి మాటలకు. తను ఏ ధర్మానికి కట్టుపడి ఆమెకు ఆశ్రయం ఇచ్చాడో, తను ఏ ధర్మానికి కట్టుపడి కాలాన్ని, పరువాన్ని జయించాడో దానినే కామేశ్వరి అధర్మమంటూంది.

"కామేశ్వరీ! ధర్మమనేది హృదయ స్థైర్యాన్ని బట్టి ఏర్పడుతుంది. స్థైర్యానికి తావలాలైన పవిత్రత, త్యాగం ఆత్మ చుట్టూ అల్లుకొంటాయి. అది పోగొట్టుకుంటే స్వార్థం, అపవిత్రత, బలహీనత ఏర్పడతాయి. వాటినిబట్టే ధర్మాధర్మాలు నిర్ణయించేది. నాతో జీవించి, నన్ను అర్థం చేసుకొని కూడా నువ్వు పొరపడుతున్నావు."

కామేశ్వరి కళ్ళలోని నీడలు ఇంకా తొలగలేదు.

"కామేశ్వరి స్త్రీ అని తెలుసుగాని స్త్రీ కామేశ్వరి లాంటిదని ఇప్పుడే తెలుసుకున్నాను. జీవితంలో ఇంత పొంది, ఇన్ని నేర్చిన తరవాత నువ్వనుకొనే పరిస్థితికి ఈ రామనాథం దిగజారడు. నేను ఏదైనా ఎవరికైనా ఇచ్చానంటే అది నాలో దాగిన దయ. కాని, ఆ దయ ఉద్భవించిన హృదయాన్నే నీకు అర్పించివేశాను. కాని, నువ్వు ఆ హృదయాన్ని కదిల్చి రూపం తెలుసుకుని కూడా అర్థం చేసుకోలేకపోతున్నావు. అది ...అది స్త్రీగా జన్మించినందుకు నీకు శాపం...అంతే, కామేశ్వరీ....అంతే."

"ఏమండీ!" కామేశ్వరి కంఠం ఆ వర్షపు రాత్రిలో పిడుగులా మారుమోగింది.

"మాటలు చెప్పి మాపివేయడానికి నేనేమీ పసిపిల్లను కాను. చేసిన తప్పును ధర్మం పేరుతో కప్పిపుచ్చడానికి ఎందు కింత ప్రయత్నం చేస్తారు? మీరు వల్లించే ధర్మసూత్రాలు ఇతరుల కోసమేనని నాకు తెలుసు. అందుకు మిమ్మల్ని నిందించి ప్రయోజనం లేదు. మీ రన్నట్లు నేను స్త్రీని. పాపిష్టి దాన్ని. మీకు శరీరాన్ని, హృదయాన్ని ఇచ్చి వాటి ప్రతిఫలం పొందలేక ఏమీ లేక ఒంటరిగా ఏడ్చేదాన్ని. అది నా ఖర్మ." కామేశ్వరి వలవల ఏడుస్తూంది. మాట్లాడుతున్నంతసేపు ఆమె కంఠం బొంగురుపోయింది కూడాను. కళ్లనుంచి నీళ్ళు మాత్రం నిరంతరంగా ఉబికి వస్తున్నాయి. ఆ కన్నులలో అవమానం, ఈర్ష్య ఎర్రజీరలు పారాడుతున్నాయి.

"కామేశ్వరీ! నేను ఏ నేరం చెయ్యలేదో దానిముందు నన్ను నేరస్థుడుగా నిలబెడుతున్నావు. అంత శక్తిని సహించే శక్తి నాలో ఉందో లేదో నీ కనవసరం. కాని, నువ్వు ఏ అపవిత్రతను ఆధారంగా తీసుకున్నావో, ఏ అర్థంతో కల్మషం కావిస్తున్నావో అది నిన్ను నిలువెల్లా దహిస్తుంది. జాగ్రత్త" అని బయటికి వచ్చాడు. గదిలో మంచంమీద ఆమె లేదు. వరండాలో చూచాడు. అక్కడ లేదు. మేడమెట్ల పక్కకు వెళ్లి చూచాడు. అక్కడ లేదు. మేడమెట్ల కింద గదిలో మామగారు పక్క సర్దుకొంటున్నారు. బయట తలుపులు తీసి చూచాడు. చినుకులు చిన్న చిన్నగా పడుతున్నాయి. చలిగాలి తెరలు తెరలుగా వీస్తూంది. మెరిసిన మెరుపులో రోడ్డు చివరగా తూలుతున్న ఓ స్త్రీ ఆకారం నెమ్మదిగా కదిలి వెళ్లిపోతూంది. దీర్ఘంగా నిట్టూర్చాడు రామనాథం. కామేశ్వరి అంతవరకు రామనాథం వంక చూస్తూ లోపలకు వెళ్లిపోయింది.

దూరంగా పోతున్న ఓ స్త్రీ, ఆమెను వెంటాడుతున్న రామనాథం ఆత్మ, ఆ ఆత్మను వెంటాడుతున్న కామేశ్వరి ఆత్మ—ఆ నిశీథిలో ముగ్గురి ఆత్మల ఆవేదన అన్యవిధాలుగా ఉండటం చూచి ప్రకృతి గాంభీర్యం వహించింది.

ఆ మరునాటినుంచి కామేశ్వరికి, రామనాథానికి మధ్య మాటలు చాలా తక్కువగానే ఉన్నాయి. ఉదయమే ఆఫీసుకు వెళ్లటం, మళ్లీ సాయంత్రం ఇంటికి రావటం, ఏ పుస్తకమో ముందు వేసుకుని చదవటం— ఇలా సాగిపోతూంది. సరిగ్గా తొమ్మిదిన్నర అయ్యేసరికి టేబిల్ మీద భోజనం సిద్ధంగా ఉండేది. మధ్యాహ్నం ప్యూనుద్వారా కాఫీ టిఫిన్ అంపేవి. మళ్లీ సాయంత్రం ఇంటికి రాగానే కాఫీ టేబిల్ మీద ఉండేది. రాత్రి మళ్లీ భోజనం అన్నీ సక్రమంగా జరిగినా మదిలో రామనాథానికి వలసిన ఆత్మీయతలేదు. స్త్రీగా కామేశ్వరి ఇచ్చిన అనురాగం పురుషుడుగా రామనాథం పొందలేకపోతున్నాడు. ఆ రెండు స్త్రీ పురుష హృదయాల మధ్య కొన్ని నీడలు కదలాడుతున్నాయి.

ఓ వారం రోజులకు కామేశ్వరిని తీక్ష్ణంగా పరిశీలించాడు రామనాథం. మనిషి చాలా కుంగిపోయింది. బహుశా భోజనం కూడా సరిగా చేయటంలేదు కాబోలు. కొంచెం వాడిఉన్న ముఖంలో కొంత గంభీరత కామేశ్వరి తెచ్చిపెట్టుకోవాలని అనుకున్నా వ్యర్థమైపోతూంది.

తన పక్కకు కామేశ్వరిని తిప్పుకొంటూ అన్నాడు రామనాథం: "కామేశ్వరీ! నువ్వు భోజనం ఎందుకు మానివేయాలో నాకు అర్థం కాదు. ఆ విధంగా కృశించిపోయి నన్ను సాధించదలుచుకుంటే చాలా పొరపాటు పడుతున్నావని చెబుతాను."

కామేశ్వరి కళ్ల నీళ్ళు గిర్రున తిరిగాయి.

"నా ఆత్మ కల్మషం అయిపోయిందని నువ్వు భావిస్తున్నావు. నువ్వు చూచే కోణంలో నా ఆత్మ చాయ కూడా అగుపడదు. అయినా నేను పతితుణ్ణయితే నువ్వు కృశించిపోవలసిన అవసరం లేదు."

"ఉంది. మీరు నా జీవితాన్ని పంచుకొన్నారు. స్త్రీగా నేను చేసిన పొరపాటు నా జీవితాన్ని మీకు పంచి ఇవ్వటమే. రెండు ఆత్మల సమ్మేళనంలో మరొక ఆత్మ మోసగిస్తూఉంటే చూచి ఎలా ఉండగలను?

> స్వల్పంతో సంతృప్తి చెందేవాడు భాగ్యవంతులలో కెల్లా భాగ్యవంతుడు. ఏమంటే సంతృప్తి ప్రకృతి ప్రసాదించిన గొప్ప సంపద.
>
> —సోక్రటీస్

ప్రపంచంలో ఏ ఆడది తనకు అన్యాయం జరుగుతూ ఉంటే సహించలేదు. స్త్రీగా నేను చేసిన తప్పుకు మీరు తగిన శిక్ష విధించారు."

"కామేశ్వరీ!" రామనాథం కంఠం ఆ గదిలో మారుమోగింది. కోపం, ఏహ్యం రెండు భావాలు ఆయన ముఖంలో పొరాడి కంఠంలో స్థానం కలిపించుకుంటున్నాయి.

"అవును. నువ్వు పొరపాటు చేశావు. చాలా పొరపాటు చేశావు. రామనాథానికి ఆత్మ సమర్పణ చేసుకొని ఏడుస్తున్నావు. అలాగే ఏడు. జీవితాంతం నువ్వు అలాగే ఏడుస్తూ చీకటిలో కూర్చుని ఉంటే నేను వెలుగు వాకిలి దగ్గర నిలబడి నవ్వుతూంటాను. నా నవ్వు నీ హృదయాన్ని ఛేదించాలి. నీ గుండెల్ని ముక్కలు చెయ్యాలి. బహుశా నీలోని స్త్రీత్వం నిజాన్ని గ్రహిస్తుందేమో! నువ్వు స్త్రీవి. అందుకే కృశించిపోవాలి. చావాలి." విసురుగా లేచి వెళ్లి కిటికీ దగ్గిర నిలబడి బయటకు చూడసాగాడు. కామేశ్వరి వచ్చే దుఃఖాన్ని దిగమింగి చాప పరుచుకొని దిండులో తల దూర్చింది. ఆ రాత్రి వాళ్లిద్దరికీ నిద్ర లేదు. నాలుగు గోడల గది మధ్యలో రెండు చీలిన అంతర్యాలు చీకటిలో లీనమై మళ్లీ వెలుగులోకి రావటానికి అనుభవం లేక అల్లల్లాడుతున్నాయి.




# నేరస్థుడు

మరువాటినుంచి కామేశ్వరి మంచం పట్టింది. మంచం పట్టిందని వారం రోజులకుగాని తెలియలేదు రామనాథానికి. అయితే రామనాథానికి తెలిసిన తరవాత కూడా ఎటువంటి చలనం లేదు. ఏమీ పట్టనట్లే ఊరుకున్నాడు. ఆఫీసుకు రావటం, వంట మనిషి వడ్డించిన వంట తినటం, తన గదిలోకి పోవటం. చాలా జరుగుతూంది. కామేశ్వరిని చూడాలంటే అతనికి అభిమానం అడ్డు వస్తూంది. కామేశ్వరిలో అగుపడిన బలహీనమైన భావన భయపెట్టింది. కామేశ్వరి గుండెలలో రామనాథంమాటలుమారుమోగుతున్నాయి. "నువ్వు స్త్రీవి. అందుకే కృశించి చావాలి. నువ్వు చీకటి అంచులో కూర్చుని జీవితాంతం ఇలాగే ఏడుస్తూ ఉండు. నేను వెలుగువాకిలి దగ్గిర నిలబడి నవ్వుతూ ఉంటాను. నా నవ్వు నీ గుండెల్ని ముక్కలు చెయ్యాలి." ఆ గుండెలను రామనాథం మాటలు నిజంగానే చీల్చి వేస్తున్నాయి. చీలిపోతున్న గుండెలను అతికించడానికి ప్రయత్నిస్తూ కామేశ్వరి ఆలోచించసాగింది. 'స్త్రీ... ఏమిటి, భగవాన్? ఆత్మలోని ఆవేదనను కూడా నివారించుకొనటానికి హక్కు లేదా, భగవాన్? ఎందుకు స్త్రీని సృష్టించావు? జీవితంలో జీవాన్ని గురించి ఆలోచిస్తూ మగవాడి జీవితాన్ని మధురంగా చెయ్యటానికి పుట్టించి ఆ పని పూర్తిచేసిన తరవాత ఇలాగా కృశించవలిసినదేనా?'

నీరసంగా నవ్వుకుంది కామేశ్వరి.

స్త్రీ... స్త్రీ...స్త్రీ... స్త్రీ... స్త్రీ... ఆ గదిలోని ప్రతి వస్తువు అలాగే అరుస్తూంది. గోడ మీద అగుపడుతున్న తన మంచం నీడ. తన నీడ తనను చూచి అలాగే అరుస్తూ వెకిలిగా నవ్వుతున్నాయి. ప్రపంచంలో అన్నీ క్షణికావేశాలే. అయితే ఆక్షణికాలలో ఎక్కువ క్షణికత్వం పొందేదే స్త్రీ. క్షణికత్వ ప్రకాశం లేని ఆమె వ్యక్తిత్వం స్త్రీత్వపు కకవలె కాలిహరించి పోవాలి. కనీసం వాసన కూడా మిగలకూడదు. అర్థించడానికి జీవితం, అనుభవించడానికి స్త్రీత్వం, అనుభవంగా నిలబడటానికి స్త్రీ...

మళ్లీ రామనాథం మాటలు ఆమె చెవులలో మారు మోగుతుండగా ఆమె అనంతంలో కలిసిపోయింది. ఆ క్షణం ఎవరికీ తెలియదు. చాలా ఘోరమైన క్షణం. ప్రపంచంలోని సర్వ ఆవేదనా కలిక ఒక్కసారి వెలిగిన క్షణం. ప్రపంచంలోని సర్వ స్త్రీత్వ వాహిని వెల్లువలా పొంగిన క్షణం, జీవితపు పొరల చాటున ఉన్న జీవాన్ని అనేక ప్రయత్నాలతో వెలికితీసిన క్షణం — ఎవరికీ తెలియదు.

మరుక్షణం మాత్రం రామనాథం కళ్లనుండి రెండు చుక్కలు జలజలా రాలాయి.

* * *

ఉద్రేకంతో ఉప్పొంగిన ఆవేగంతో డైరీ మూసి వేశారు రామనాథంగారు. గత జీవితాన్ని తలుచుకొని ఆయన హృదయం కొంచెంగా కదిలింది. చదివిన తరవాత ఆయన పూర్తిగా ఒక నిశ్చయానికి వచ్చాడు.

'అవును. కామేశ్వరిని చంపింది నేనే, కామేశ్వరిని చంపింది నేనే!' ఆ మాటలు అస్పష్టంగానే పెదవులను

నెట్టి బయటికి వచ్చాయి. వాటితోపాటు కళ్లలో నుంచి బిందువులు గిరగిర తిరిగాయి. కళ్లనీళ్లను తుడిచి తల ఎత్తాడు రామనాథం. ఎదురుగా సావిత్రి నిలబడి ఉంది.

"నాన్నా, ఏమిటి ఇలా ఉన్నారు? ఏమి జరిగింది?"

"ఏమీ లేదమ్మా. ఒక్కొక్కప్పుడు మనస్సు అలాగ ఉంటుంది. పెద్దతనం కదూ!" మాట తోసివేసి డైరీ చేత పుచ్చుకొని తన గదిలోకి వెళ్లాడు. వెళుతున్న తండ్రివంక అలా చూస్తూ ఉండిపోయింది సావిత్రి. ఆయన మనసులో ఏదో కలత ఉందని తెలుసు. అయితే అదేమిటో సావిత్రికి తెలియదు. ఇన్ని ఏళ్ల గడిచిన తరవాత తన తండ్రికి కలిగిన బాధేమిటో సావిత్రికి అర్థం కాలేదు.

టేబిల్ సొరుగులో డైరీ పెట్టి దానికి తాళంవేసి కాసేపు కుర్చీలో కూర్చున్నాడు తల చేత్తో పట్టుకొని. తల విపరీతంగా బాధ పెడుతూంది. అంతకన్న మనసులోని మానని గాయం మళ్లీ రేగి మరింత బాధకలుగుతూంది. ఆ గాయానికి ఎటువంటి మందు వాడాలో ఆయన తెలుసుకోవలసిన వయస్సు దాటిపోయింది.

"తాతయ్యా! అమ్మ భోజనానికి రమ్మంటూంది." మూడేళ్ల మనవడి కేక విని ఉలిక్కిపడి లేచి వంట ఇంటికేసి నడిచాడు. మూడేళ్ల మనవడు రవి అంటే రామనాథంగారికి విపరీతమైన ప్రేమ. వాడు అచ్చు రామనాథంలాగానే ఉంటాడు. అందుకే అంత ప్రేమ. ఆ మూడేళ్ల జీవితంలో చాలాకాలం వాడితో ఆడుకొనటానికి సరిపోయింది ఆయనకు.

ఇవాళ వాడు ముద్దుగా పిలిచినా రామనాథంగారికి ఏమిటోగా ఉంది. మదిలో నాదం లేని అలల కలవరింత తప్ప మరేమీ లేదు. తనను ఎత్తుకొని ముద్దు పెట్టక పోయేసరికి వాడు మూతి ముడుచుకొని వెళ్లిపోయాడు.

భోజనం చేస్తూ తలఎత్తి చూచారు రామనాథంగారు. పక్క వాకిట్లో తల మోకాళ్లమీద ఆనించి బుంగమూతి బుగ్గలమీద చేతులుఉంచి కోపంగా రామనాథం వంక చూడసాగాడు రవి. రామనాథానికి వాడిని దగ్గిరకి పిలిచి బుజ్జగించా లనిపించలేదు. వాడు కూడా ఆయనవంక చూడడం 'నువ్వుతప్పుచేశావు, తప్పు చేశావు' అన్నట్లుగా ఉంది. అన్నం సయించక మధ్యలోనే చేతులు కడుక్కొని వెళ్లాడు రామనాథం. అలా ఎందుకు వెళుతున్నాడో తెలియక తికమకగా చూస్తూ ఉండిపోయింది రామనాథంకోడలు; అంటే రామం భార్య. అలా ఎన్నడూ జరగలేదు. అందుచేత ఆమెలో ఆశ్చర్యం, అమాయికత కలిసిపోయాయి.

రాత్రి ఎప్పుడో రామనాథంగారు లీలగా నిద్రలో మునిగిపోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు మాత్రం రామం హాస్పిటల్ నుంచి వచ్చిన చప్పుడు వినిపించింది. కొంచెంసేపటికి కోడలు మాటలు కూడా ఆయన చెవిలో పడ్డాయి. "మామయ్య ఇవాళ సరిగా భోజనం చెయ్యలేదు. సగంలోనే లేచి వెళ్లారు."

"డైజెషన్ సరిగా ఉండి ఉండదు. రేపు పరీక్ష చేస్తాలే." గొప్పవాడిననిపించుకొన్న డాక్టర్ రామం మాటలు ఆ తండ్రి అయిన రామనాథానికి కొంచెం సరిగానే వినపడ్డాయి. నీటిని మెదడులోనుంచి తొలగించి కొన్ని అస్పష్ట దృశ్యాలను మెదడులోనికి చొప్పించి నిద్రకు ఉపక్రమించాడు. నిద్రలోనే అస్పష్ట భావం, స్త్రీత్వపు ఆవేదన ఒక స్త్రీ రూపంతో కలిశాయి. ఆమె జీవితపు చివరి అంకంలోకి వెళుతూ ఏదో గొణుక్కొంటూ ఉంది. ఆ విధమైన నవ్వడిలో ఓ బాధ, అంతర్యంలో యుద్ధం, ఆత్మలో నిర్జీవత అగుపడుతున్నాయి.

ఉలిక్కిపడి లేచాడు రామనాథంగారు. అంతా చీకటి. గదిలో చీకటి. మనసులో చీకటి. మనిషిలో చీకటి...చీకటిలో మనిషి.

స్విచ్‌బోర్డువరకు తడుముకొంటూ వెళ్లి లైటు వేశాడు. లైటు వెలిగింది. హృదయంలోని చీకటిని కొంచెంసేపు పారదోలి అటు ఇటు చూశారు. ఎవ్వరూ లేరు. హృదయంలోని ఆందోళన ఎక్కువైంది. శరీరమంతాచెమటలు పట్టి బలహీనత వ్యాపిస్తూంది. సడలిన శరీరం శక్తి కోల్పోయింది. ఆయనలో ఏదో బలహీనత నీడలా క్రమంగా వ్యాపించింది.

తను ఇంతవరకు కామేశ్వరిని చూశాడు. అవును, కామేశ్వరి. తన చేతిమీద చంపివేసిన స్త్రీ.

"అవును, కామేశ్వరీ, నేను నిన్ను చంపాను. నువ్వు నేరం చెయ్యలేదు. కాని, నేను నేరం చేశాను. నిన్ను చంపిన నా ఆత్మ కలుషితం, కఠినం అయిపోయింది." టేబిల్‌లోని డైరీ తీసి కొన్ని పేజీలు చదివివేశాడు. "నేను నేరస్థుణ్ణి ... నేను ... నేరస్థుణ్ణి. అందుకని నిన్ను నేరస్థురాలుగా సృష్టించిన నా చేతులు ఈ గీతల్ని చింపి నలిపి వేస్తున్నాయి. అయినా నువ్వు నాకు కనపడవు."

గది తలుపులు తీసి బయటికి వచ్చాడు. నెమ్మదిగా నడుస్తూ సావిత్రి గది దగ్గిరకి వెళ్లి నెమ్మదిగా తలుపు తోసి తొంగి చూచాడు. సావిత్రి మంచంమీద పడుకొని నిద్రపోతూంది. ప్రపంచంలోని అన్ని విషయాలు మరిచిపోయిన చిహ్నాలు ఆమె ముఖం మీద అగుపడుతున్నాయి. మళ్లీ తలుపు దగ్గిరగా వేసి రామం గది దగ్గిరకి వెళ్లాడు. రామం గది లోపల గడియవేసి ఉంది. కిటికీ దగ్గిరకి వెళ్లి తెర తొలిగించి తొంగి చూచాడు. రామం భార్య మెడమీద చెయ్యి వేసి తృప్తిగా నిద్రపోతున్నాడు. భార్య కూడా అతనిలోని తృప్తిని సగం పంచుకున్నట్లుంది. దగ్గిరగా మరొక మంచంమీద మూడేళ్ల రవి. తన చిన్ని కన్నులలో విశాల ప్రపంచాన్ని దాచుకొని నిద్రపోతున్నాడు. 'వాడిలో కూడా ఎంత తృప్తి!' అనుకొన్నాడు రామనాథం. తెర వదిలివేసి మళ్లీ తన గదివద్దకు బయలుదేరాడు. ఈ ఇంటిలో అందరికి తృప్తి ఉంది. అందరూ హాయిగా నిద్రపోతున్నారు. తనకు నిద్ర లేదు. తృప్తి లేదు. తను నేరస్థుడు. తనకు స్త్రీత్వాన్ని పంచి ఇచ్చిన స్త్రీని కుళ్లింపచేసి చంపివేశాడు. తను తప్పు చేశాడు. అందుకే వ్యథ పొందుతున్నాడు.

తను మానవుడు. అందులో మగవాడు. ఆత్మ నిర్ణయించే హద్దులను అధిగమించి కాలంతో పరిగెత్తాలనుకొని వెళ్లకిలా పడ్డాడు. చాలా నెప్పి... జీవితమంతా నెప్పి ... ఆ నెప్పి...ఆత్మను ఆరాధిస్తే మిగిలింది కాదు. తనలో ఏదో ఆత్మశక్తి ఉండేదను కొన్నాడు. కాని, అది కాలపు పరుగుమీద ఓడిపోయిందని జీవితంలో చరమాధ్యాయపు చివరి పేజీలో తెలుసుకొంటున్నాడు.

ఆయనలో ఆత్మకు సంఘర్షణ జరుగుతూంది. బలహీనమైన శక్తి, బలహీనమైన భావాలు, బలహీనమైన కాలపు మూల్గులు, బలహీనమైన అనుభవాల నవ్వులు—ఇవన్నీ రామనాథంగారికి తలపుకు వచ్చాయి. కాలం మానవుణ్ణి నాశనం చేసేది. పరిగెత్తించేది. అగాథంలోనికి విసిరివేసేది కాలమే. దానిని పొందాలని తను అనుకోలేదు. అందుకే జీవితానికి, కాలానికి, ఆత్మకు కూడా ఓడిపోయాడు. తను నేరస్థుడు. గదిలోకి వెళ్లి తలుపులు గడియవేసి డైరీలోని చింపిన పేజీలు ఒకచోట పోగుచేసి అగ్గిపుల్ల గీసి అంటించాడు. కాగితాలు ఒక్కసారి అంటుకొని జ్వాలలు విరజిమ్మాయి.

## ఆ పువ్వు

**మార్పూరి విజయలక్ష్మి**

**ఆ పువ్వు** నను జూచి
నవ్వింది దేనికో!
ఆ నవ్వు నా గుండె
నొరిసింది దేనికో!
గుండెలో కోరికలు గుప్పుమని పొంగగా
మమతలల్లిన మనసు మారాము చేయగా
ఏమిటో ఆ సుమము
మోము వికసించింది!
కొండ గాడ్పులు తన్ను రాచుకొని వీచినా
మండు టెండల మేను ముగ్గియే పోయినా,
మురిసింది ఆ పువ్వు
విరిసింది నను చూచి!
నా పూవు నాతోటి
నడిచి వస్తానంది.
ఆ పూవు గుండెలో అమృతమ్ము పొంగింది!
నా జీవితానికొక జీవమ్ము పోసింది! *

ఆ జ్వాలలలో ఆయన ఆత్మలో సంఘర్షణ, కాలపు ఆవేదన, అనుభవాల నివేదన మండుతున్నట్లు అగుపడ్డాయి. వాటిని చూచి తృప్తిగా నవ్వుకొని మంచం మీద పడుకొన్నాడు. తృప్తిగా పడిన కళ్లలోనుంచి, తృప్తిగా నవ్వుతున్న పెదవులలోనుంచి, తృప్తిగా నవ్వుకొంటున్న ఆయన హృదయంలోనుంచి ఆయన ప్రాణవాయువులు ఎప్పుడు వెళ్లిపోయాయో కాలానికి తెలియదు. ఆయన ఆత్మకు కూడా తెలియదు. ఆయన ఆత్మ ప్రాణాలకంటె ముందే మరొక మ[illegible] కోసం వెళ్లింది.

చాలాకాలానికి తనే నేరస్థుడు అని తెలిసికొన్న ఛాయ ఆయన ముఖంమీద అగుపడుతూంది. ✯